క్లుప్తంగా

కోట శ్రీనివాసరావుకు ఘన నివాళులు

ఒంగోలు మెట్రో: 750 చలన చిత్రాలలో విభిన్నమైన పాత్రలలో నటించి తెలుగు ప్రేక్షకులను అలరించిన కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున కన్నుమూయడం చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని ఎగ్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ అన్నారు. ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావు 20 సంవత్సరాల క్రితం ఒంగోలు వచ్చినప్పుడు డాక్టర్ మాచిరాజు రామచంద్రరావు స్వగృహంలో కళాకారులు కలిసి ఘనంగా సత్కరించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. కోట శ్రీనివాసరావు కేవలం కళాకారుడే కాకుండా భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారని ప్రముఖ సాహిత్యవేత్త నెమ్మాని సీతారామమూర్తి కొనియాడారు. అదే విధంగా శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కోటా మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుర్రా ప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ఫీడర్‌కు నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు విద్యుత్ సరఫరా చేసే లైన్‌లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ చెన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు, చెట్లు కొట్టే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. గుండ్లాపల్లి, గార్లపాడు, ఘడియపూడి, బూరేపల్లితో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా లలిత సంగీత విభావరి



సంగీత కచేరిలో విద్యార్థినులు

ఒంగోలు మెట్రో: త్యాగరాజ సేవా సమితి ఎనిమిదో మాస సంగీత కార్యక్రమాలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీ గాయత్రి మందిరంలో శ్రీ శారద సంగీత పాఠశాల ఉపాధ్యాయులు నేలబొట్ల సౌమ్యలత, వారి శిష్యులైన విద్యార్థులు చక్కగా గానంచేశారు. ముందుగా అభీష్ట వరద శ్రీ మహాగణపతితో మొదలు పెట్టి తిరుమల గిరి రాయ, గరుడ గమన, పరమ పురుషా, జగడపు తనువుల, కట్టెదుర వైకుంఠం, పరమ పురుషా, మొదలైన అన్నమాచార్య కీర్తనలు, నారాయణ తీర్థులు వారి కృష్ణం కలయ సఖి, నీలమేఘ శరీర వంటి కీర్తనలు పాడగా శ్రోతలను అలరించాయి.

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. గత 55 వారాల నుంచి అన్నదాన కార్యక్రమాలను సంతనూతలపాడులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్ట్ సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, మంచికలపాటి రఘు, ఆర్.జార్జి, వేమా కవిత, ఎస్.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందాల్సిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సోమవారం ఉదయం 9 గంటలకు అర్ధవీడు గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

గురుకులంలో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎస్సీ కేటగిరిలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులో ఎస్సీ కేటగిరిలో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్.ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరిలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డుతో వెలుగొండ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతిని అరికట్టండి

దర్శి: ఉపాధి హామీ పనుల్లో జరిగే అవినీతిని అరికట్టాలని జన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తెనాలి రవిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనికి వచ్చే కూలీల దగ్గర నుంచి రోజుకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ నగదు అంతా ఎవరి జేబుల్లోకి వెళుతుందో తేల్చాలన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- పలువురు నాయకులకు పరామర్శ, మృతులకు నివాళులు



పిడతలపూడిలో మేకల వీరారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటామని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున భరోసా ఇచ్చారు. చీమకుర్తి మండలంలోని పిడతలపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షుడు మేకల వీరారెడ్డి తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు గోవిందరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం మేరుగు నాగార్జున వెళ్లి గోవిందరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా చీమకుర్తి మండలంలోని పాటిమీదపాలెం గ్రామంలో ఇటీవల మరణించిన బిల్లా హనుమయ్య కుటుంబ సభ్యులను, కూడలి ఏడుకొండలు కుటుంబ సభ్యులను మేరుగు నాగార్జున పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చీదర్ల శేషు, గ్రీవెన్స్ విభాగం మండల అధ్యక్షుడు కత్తి రమణారెడ్డి, స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు సాదినేని వెంకటరావు, మండల మాజీ అధ్యక్షుడు దాసరి లక్ష్మీనారాయణ, నాయకులు తెల్ల మేకల గాంధీ, పులి వెంకారెడ్డి, శేషారెడ్డి, కూరాకుల సుబ్బారెడ్డి, ఓబులరెడ్డి, కూడలి మాలకొండయ్య పాల్గొన్నారు.

పోతవరం, తక్కెళ్లపాడులో మృతులకు నివాళులు...

నాగులుప్పలపాడు: మండలంలోని పోతవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కూనం కృష్టారెడ్డి తండ్రి కూనం వెంకట నరసారెడ్డి, తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దాసరి సీతారావమ్మ మృతి చెందడంతో ఆదివారం మేరుగు నాగార్జున వెళ్లి పూలమాలతో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్టారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పోలినేని కోటేశ్వరరావు, పాలడుగు రాజీవ్, తగిరిశ సుబ్బారావు, మద్దిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, కాటూరి ఆదెయ్య, పాదర్తి శివ, కందుల దానియేల్, ఘట్టమనేని అశోక్, పాద పవన్, గండు వెంకటరావు, అత్తంటి ఏసు, సర్పంచ్ శీలం రేణుక సురేష్, మాజీ సర్పంచ్ ఆదాము, కాకర్ల వెంకటేష్, యేసుపాదం, డాకా అంజిరెడ్డి, డాకా రాజీవ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, వారి కుటుంబ సభ్యులు



సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించి 1,600 మందికి కంటి పరీక్షలు చేశారు. 4,500 మందికిపైగా అన్నదానం చేశారు. ముందుగా బూచేపల్లి కమలాకర్‌రెడ్డి ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు.
– చీమకుర్తి



కంటి వైద్య శిబిరానికి పలు గ్రామాల నుంచి భారీగా హాజరైన ప్రజలు

హారికపై దాడిని ఖండిస్తున్నాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి



కేవీ రమణారెడ్డి

ఒంగోలు సిటీ: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీని టార్గెట్ చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి వందల మందిని జైలు పాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లాంటి దారుణమైన పాలన గతంలో ఎన్నడూ చూడలేదని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. కేవలం కక్షసాధింపులు, వేధింపులు, దాడులు, దౌర్జన్యాలతో ఏడాది కాలం గడిపారన్నారు. వ్యక్తిగత కక్షలు, దాడులు, అరెస్టులు దారుణమని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

టిడ్కో గృహాలు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

ఒంగోలు టౌన్: అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేయాలని, అందుకు అవసరమైన రూ.180 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం నగర కమిటీ సమావేశానికి జీ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇచ్చిన మాట నిలుపుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలు నగరంలోని కొప్పోలు, చింతల దగ్గర 66 శాతం, కొప్పోలు దగ్గర 52.86 శాతం గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మురుగుపారుదల, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సౌకర్యాల కోసం 180 కోట్ల రూపాయలు అవసరమవుతాయని వివరించారు. 2018లో ప్రారంభించిన టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నప్పటికీ టిడ్కో ఇళ్ల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మాటలు చెప్పడం మాని టిడ్కో ఇళ్లను పూర్తి చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకులు తంబి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, టి.మహేష్, వీరాస్వామి, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



అమ్మవార్లకు సద్ది పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

- గ్రామ దేవతలకు విశేష హారతులు
- మొక్కులు తీర్చుకున్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక బాలాజీరావుపేటలో 250 సంవత్సరాల క్రితం వెలసిన శ్రీ పోలేరమ్మ, అంకమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం జలాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర నుంచి సామూహికంగా పాల్గొన్న మహిళలు 108 కలశాలతో జల సేకరణ చేశారు. అమ్మవార్ల భజనలతో ఆలయానికి చేరుకున్నారు. ముందుగా ఆలయ క్షేత్రపాలకుడు పోతురాజుకు పసుపు, కుంకుమ సమర్పించి కొబ్బరికాయలతో నివేదన చేశారు. అనంతరం మహిళలు 108 కలశాలను అర్చకులకు అందించారు. ఆ జలంతో పోలేరమ్మ, అంకమ్మ, మహాలక్ష్మి మూలమూర్తులకు అర్చకులు జలాభిషేకం నిర్వహించారు. 16 రకాల విశేష ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవార్లకు సద్ది, పొంగళ్లు, కుడుములను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మూలమూర్తులకు విశేష హారతులిచ్చి భక్తులకు అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. రాత్రికి ఆలయ కార్యనిర్వాహకుల ఆధ్వర్యంలో కనక తప్పెట్లతో విద్యుత్ దీపాలంకరణతో పోలేరమ్మ బండ్ల నగరోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జునస్వామికి పూజలు చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు కూటమి ప్రభుత్వం అన్యాయం



మాట్లాడుతున్న నాగేంద్రరావు

ఒంగోలు వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా ఇప్పటి వరకూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి నిధులు విడుదల చేయకుండా అన్యాయం చేస్తోందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. ఒంగోలులోని సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాల కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించారేగానీ 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయి కూడా ఎస్సీ, ఎస్టీలకు విడుదల చేయలేదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా అవే నిధులు విడుదల చేస్తామని నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఎక్కడా లేనటువంటి నిబంధనలు విధించి ఎస్సీ లబ్ధిదారులను మానసికంగా కుంగదీస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలకే వృద్ధాప్య పెన్షన్లు అందిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు హామీ ఇచ్చారన్నారు. కానీ, నేడు అమలు చేయడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్‌ను కూడా కూటమి దారి మళ్లించి ఎస్సీ బాధితులను అణగదొక్కుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలేదన్నారు. తల్లికి వందనం కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ నిధులు మళ్లిస్తున్నారన్నారు. కనిగిరి, కరేడు ప్రాంతాల్లో వందల ఎకరాల భూములను బలవంతంగా లాక్కుంటున్న ప్రభుత్వం.. ఎస్సీల శ్మశానాలకు మాత్రం భూములు మంజూరు చేయడంలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయకుండా బాధితులపైనే కౌంటర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్తీ రాందేవ్‌బాబాకు ప్రభుత్వ భూములివ్వొద్దు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హేతువాద సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: కల్తీ మందులు, కల్తీ సరుకులు అమ్ముకునే రాందేవ్‌బాబాకు ప్రభుత్వ భూములు పందేరం చేయకూడదని హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మీడియా కెమేరామెన్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాందేవ్‌బాబా తప్పుడు ప్రచారాలపై సుప్రీంకోర్టు, కేరళ హైకోర్టు అనేకసార్లు హెచ్చరికలు జారీ చేశాయన్నారు. రాందేవ్ ఉత్పత్తులను నేపాల్ ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఇటువంటి రాందేవ్‌బాబాను ముఖ్యమంత్రి సన్మానించడం, పక్కన కుర్చోబెట్టుకోవడం, విశాఖ దగ్గరలో భూములివ్వాలనుకోవడం, హార్సిలీ హిల్స్ కొండపై స్థలమివ్వాలని నిర్ణయించడం, క్యాబినెట్ హోదాతో సలహాదారునిగా నియమించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు దగ్గర ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఆశ్రమం పేరుతో మోసం చేస్తున్న రామదూతస్వామిని అరెస్టు చేసి అతను అక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని కూడా నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. 2021లో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషారాణి ఆ మేరకు ఆదేశాలిచ్చినా ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. పుట్టపర్తి సాయిబాబా చిన్నచిన్న మ్యాజిక్కులు నేర్చుకుని తనను తాను దైవాంశ సంభూతుడిగా ప్రజల్లో ప్రచారం చేసుకుని పబ్బంగడుపుకున్నాడన్నారు. అలాంటి వ్యక్తి శత జయంతిని పండుగలా జరిపేందుకు ప్రభుత్వం జారీ చేసిన 862వ నంబర్ జీఓను రద్దు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో హేతువాద సంఘ నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, రాఘవ, కె.ప్రభుదాస్, కాలేషా బేగ్, చంద్రశేఖర్, సుభానీ, బి.సుబ్బారావు, ఎస్‌వీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ పూజ దినోత్సవం



వేముల చిరంజీవి, వీణ విద్వాన్ నాగలక్ష్మి, పుష్పలత తాయారును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: సంస్కార భారతి ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో నటరాజ పూజ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రామానుజకూటమి ఒంగోలులో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని గీతా పారాయణతో ప్రారంభించారు. వేమూరి చిరంజీవి, వీణ విద్వాన్ నాగలక్ష్మి, గీతాచార్య పుష్పవల్లి తాయారు, వారి శిక్ష బృందాలను సన్మానించారు. తూములూరి నాగలక్ష్మి శిష్యులు దేవసేన, చాందిని, అపర్ణ వీణతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ విభాగ్ ప్రచార ప్రముక్ నవీన్ పాల్గొన్నారు. ఆయన ప్రసంగిస్తూ గురువు లేని విద్వత్తు శూన్యమని, అది సరైనది కాదంటూ గురువు ప్రాముఖ్యతను వివరించారు. రాముడైనా, కృష్ణుడైనా గురు సంపత్తితోనే వెలుగొందారన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి రంగమన్నార్ పాల్గొన్నారు. వందేమాతరం గీతాలాపన అనంతరం ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

ఎమ్మెల్యే బూచేపల్లికి సన్మానం



ఎమ్మెల్యే బూచేపల్లిని సన్మానిస్తున్న మండల నాయకులు

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శిగా ఎన్నికైన భీమని సుబ్బారావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూచేపల్లి సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూనూరి దేవదానం, సీనియర్ నాయకులు గూడా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

- అండర్ 11–19 విజేతలకు ట్రోఫీలు అందజేత



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మురళీకృష్ణ

ఒంగోలు టౌన్: ఒంగోలులోని లార్డ్ కృష్ణ అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి 52వ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో విజేతల వివరాలను అకాడమీ ఫౌండర్ అద్దంకి మురళీకృష్ణ వెల్లడించారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అండర్–11 బాలుర సింగిల్స్‌లో విజేతగా చర్విక్ జై, రన్నరప్‌గా ఆర్య నందన్ నిలిచారు. బాలుర డబుల్స్‌లో అరుపానందన్, చర్విక్ జై విజేతలుగా నిలవగా జైదేవ్, అఖిల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అండర్–13 సింగిల్స్‌లో విజేతగా అఫ్రాన్, రన్నర్‌గా అఖిల్, అండర్–13 డబుల్స్‌లో అఖిల్, సంకల్ప్ టీమ్ విన్నర్‌గా, అభిరాం, రిషి టీమ్ రన్నరప్‌గా నిలిచింది. అండర్–15 బాలుర సింగిల్స్‌లో విజేతగా షణ్ముఖ వర్ధన్, రన్నరప్‌గా శ్రీఅనూప్ నిలిచారు. అండర్–15 బాలుర డబుల్స్‌లో విజేతలుగా షణ్ముఖ వర్ధన్, అఫ్రాన్, రన్నరప్‌గా శ్రీయన్స్, అనురాగ్ నియోల్ టీమ్ నిలిచాయి.

అండర్–11 బాలికల విభాగంలో విజేతలుగా ఇషిత, రన్నరప్‌గా రిత్విక, డబుల్స్ విజేతగా సహస్ర, ఇషిత టీమ్, అండర్–13 బాలికల సింగిల్స్‌లో విజేతగా ఇషిత, రన్నర్‌గా ఫియానా, డబుల్స్ విజేతలుగా యశ్విత, హర్షిణి, రన్నరప్‌గా రిత్విక, లిఖిత నిలిచారు. అండర్–15 బాలికల సింగిల్స్ విజేతలుగా ఎస్కే రుబియా, రన్నరప్‌గా వినూత్న, డబుల్స్‌లో విజేతగా ఎస్కే రుబియా, వినూత్న, రన్నరప్‌గా యశ్విత, సింధు జట్టు నిలిచాయి. అండర్–17 బాలుర సింగిల్స్ విజేతగా షణ్ముఖ వర్ధన్, రన్నరప్‌గా శ్రేయాన్స్, డబుల్స్ విన్నర్‌గా తారక్‌రామ్ చరణ్, అరూప్ నియో, రన్నరప్‌గా వర్షిత్, ఇనాక్ టీమ్ నిలిచాయి. అండర్ 19 బాలుర డబుల్స్ విజేతగా జి.హారిత్, అభిలాష్ టీమ్, రన్నరప్‌గా ఎం.సూర్య కిరణ్, రఫి టీమ్ నిలిచాయి. పురుషుల డబుల్స్ విజేతగా రాహుల్, శశి టీమ్, రన్నర్లుగా కిరణ్, విజయ్ టీమ్ నిలిచాయి. అండర్–19 మిక్స్‌డ్ డబుల్స్ విజేతగా హర్షిత్ సాయి, వినూత్న, రన్నరప్‌గా రిషి, యశస్విని నిలిచారు. అండర్ 17 బాలికల సింగిల్స్ విజేతగా ఎస్కే రుబియా, రన్నరప్‌గా భువన శ్రీ, డబుల్స్‌లో విజేతగా భువన శ్రీ, హర్షిత టీమ్, రన్నరప్‌గా సహస్ర, యశ్విత టీమ్, అండర్ 19 బాలికల సింగిల్స్‌లో విజేతగా హర్షిణి, రన్నరప్‌గా హర్షిత, డబుల్స్‌లో విజేతగా ప్రహర్షత, భువనశ్రీ టీమ్, రన్నరప్‌గా హర్షిణి, మిథి టీమ్ నిలిచాయి. మహిళల సింగిల్స్‌లో విజేతగా డీఆర్ శర్వాణి, రన్నరప్‌గా కమల, మహిళల డబుల్స్‌లో విజేతగా ఆర్.కమల, శర్వాణి టీమ్, రన్నరప్‌గా శిల్ప, రజని టీమ్ నిలిచాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి విజయ్, రవిబాబు, రఘు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.